103069001

నాస్తి లోభ సమో వ్యాధిః
నాస్తి క్రోధ సమో రిపుః
నాస్తి దుఃఖ దారిద్ర్యవత్
నాస్తి జ్ఞానాత్పరం సుఖమ్.

విద్యార్థులారా!

నాస్తి లోభసమో వ్యాధిః. లోభమునకు సాటియైన వ్యాధి మరొకటి లేదు. నాస్తి క్రోధసమో రిపుః. క్రోధముతో సరియైనటువంటిది మరొక శత్రువు లేదు. నాస్తి దుఃఖ దారిద్ర్యవత్. దారిద్ర్యమునకంటె మించిన దుఃఖము మరొకటి లేదు. నాస్తి జ్ఞానాత్పరం సుఖమ్. జ్ఞానముకంటె పరమమైనటువంటి సుఖము మరొకటి కానరాదు. కాని యిట్టి పవిత్రమైన జ్ఞానమునకు మానవుడు అతిదూరమై పోయున్నాడు.

ఆస్తిక బుద్ధిపోయి మర్యాదల ధర్మము రూపుమాసె బల్
నాస్తిక బుద్ధి హెచ్చె గురువన్నను శ్రద్ధయు పోయి భక్తికిన్
స్వస్తి సనాతన విద్యకు స్వస్తి వహించెడి కాలమయ్యెడిన్
నిస్తుల గౌరవము ఆదరణ నేలకు గూలను వచ్చె విద్యలో.

నేను వెలుగులో నున్నాను నేనే వెలుగు
వెలుగు నాలోన నున్నది వెలుగు నేనే
అన్న భావము హృదయాన హత్తుకొన్న
అట్టి జ్ఞానియు బ్రహ్మలో ఐక్యమగును.

ఈ ప్రపంచములో మిక్కిలి ప్రాచీనమైన సాహిత్యము వేదసాహిత్యము. ఇది విజ్ఞానరాశి. మానవుని సర్వతోముఖాభివృద్ధి గావించునది యీ వేదమే. మానవుని చరిత్రకు మొట్టమొదటి పాఠ్యగ్రంథము వేదమే. మానవుని సంస్కృతికి, పదశక్తికి మూలాధారమైనటువంటి పుట్టినిల్లు యీ వేదము. 'సర్వం వేదావశిష్యతే' అన్నాడు మను. అనగా సమస్త విద్యలు కూడను యీ వేదములనుండి ఆవిర్భవించినవే. సర్వగుణములు, సర్వధర్మములు వేదము నుండియే ఆవిర్భవించినవి. 'అనంతో వై వేదాః' ఈ వేదము అనంతమైనది. అగాధమైనది.

అప్రమేయమైనది. ఆనందమయమైనది. 'విద జ్ఞానే' అనే ధాతువునుండి పుట్టినది యీ వేదము. అనగా ఈశ్వర జ్ఞానమే యీ వేదము. ఆత్మజ్ఞానమే వేదము. బ్రహ్మజ్ఞానమే వేదము. అద్వైత జ్ఞానమే వేదము. విజ్ఞానమే వేదము. ఇవన్నియు కూడను ఆత్మజ్ఞానమునకు పర్యాయ పదములు. కాని యిట్టి పవిత్రమైన వేదమును సామాన్యులు అర్థము చేసుకొనలేరు. అర్థము చేసుకొన్ననూ చేసుకొనక పోయినను వేదము యొక్క దివ్యత్వం సర్వత్ర వ్యాపించి వుంటున్నది. ఇది శబ్ద బ్రహ్మము.

శబ్ద బ్రహ్మమయి చరాచరమయి జ్యోతిర్మయి వాఙ్మయి
నిత్యానందమయి పరాత్పరమయి మాయామయి శ్రీమయి.

ఇదియే ప్రజ్ఞానమయమైన బ్రహ్మము. ఇదే constant integrated awareness. ఇది ఒక కాలమునకు గాని, ఒక స్థానమునకు గాని సంబంధించినది కాదు. ఇది విశ్వమునకే సంబంధించినది.

ఇట్టి వేదమును సామాన్య ప్రజలు గుర్తించటము కానీ లేక వర్తించటంగాని సాధ్యము కాదని తెలుసుకొని వ్యాసులవారు దీనిని నాలుగు భాగములుగా విభజిస్తూ వచ్చారు. వేదము నాలుగు విధములైన రూపములు ధరించినప్పటికి యీ వేదమంతయు కూడను త్రికాండములతో కూడి జగత్తంతయూ ఆచార రూపమైన ప్రచారము గావిస్తూ వచ్చింది. కర్మకాండ జ్ఞానకాండ, ఉపాసనా కాండ అని త్రికాండ స్వరూపము వేదము. మానవుడు కర్మాధిపతి. 'కర్మణ్యేవాధికారస్తే' కర్మాధికారము కొరకు కాయమును ధరించాడు. ఈ కర్మలు ధర్మమయమైనవిగా ఆచరించాలి. కనుకనే 'శరీర మాద్యం ఖలు ధర్మసాధనం' ధర్మసాధన నిమిత్తమై యీ కాయము ఆవిర్భవించినదనే సత్యాన్ని గుర్తించాలి. మానవుడు ఆచరించే కర్మలు పరిపక్వస్థితికి వచ్చినప్పుడు యిదియే వుపాసనగా మారుతుంది. ఈ ఉపాసననే దైవార్పిత భావనతో ప్రేమమయమైన దివ్యతత్త్వములో దీనిని ఆచరించినప్పుడు యిదియే పూర్ణమైన జ్ఞానముగా రూపొందుతుంది. ఏతావాతా కర్మ, ఉపాసన, జ్ఞానము మూడు కూడను ఒకటే. పుష్పముగా పుట్టి కాయగా మారి ఫలముగా రూపొందినట్లు కర్మ పుష్పము వంటిది. ఉపాసన కాయ వంటిది. జ్ఞానము ఫలము వంటిది. కనుక కర్మోపాసన జ్ఞాన స్వరూపము సామాన్య మానవులు ఆచరించే నిమిత్తమై పురాణేతిహాసములు కూడను దీనికి ఉపాంగములుగా సృష్టించబడినవి. ఈ వేదము యొక్క అంత్యమే ఉపనిషత్తు. వేదము యొక్క అంత్యము కనుకనే వేదాంతము అని పేరు.

ఈ ఉపనిషత్తులు కూడను యోగత్రయములని మూడు భాగములుగా విభజించి యోగత్రయములనే మార్గములో మానవులకు ప్రబోధిస్తూ వచ్చాయి. 'యోగ' మనగా అర్పిత భావము. మనము యే కర్మలు చేసినా అర్పిత భావములో ఆచరించాలి. దైవమునకు అర్పితమైన భావములో దీనిని ఆచరించుట చేతనే దైవార్పిత భావమనే పేరు పొందింది. 'సర్వ కర్మ భగవత్ప్రీత్యర్థం' అనే మార్గమును అనుసరిస్తూ వచ్చింది. ఇక రెండవది ఉపాసనా యోగము. యోగ త్రయములలో భగవంతుని హృదయపూర్వకముగా, ప్రేమ పూర్వకముగా త్రికరణ శుద్ధిగా ప్రేమించునదే ఉపాసనా యోగము. కేవలము అభీష్టసిద్ధికై, కార్యసిద్ధికై లౌకికమైన భ్రాంతులసిద్ధికై ప్రేమించటము ప్రేమ కాదు. ప్రేమ నిమిత్తమై ప్రేమించాలి. ఇదే ఉపాసనా యోగము. ఇక మూడవది జ్ఞానయోగము. 'సర్వం విష్ణుమయం జగత్' అంతా భగవంతుని యొక్క స్వరూపమే. సర్వుల యందు వున్నవాడు భగవంతుడు ఒక్కడే. ఏకాత్మ భావము జ్ఞాన మన్నారు. అద్వైత జ్ఞానమే నిజమైన జ్ఞాన మన్నారు. సర్వులయందు కూడను దైవత్వము ఆత్మస్వరూపములో వున్నదని విశ్వసించటమే జ్ఞానము.

విద్యార్థులకు కొన్ని సంశయములు ఆవిర్భవించవచ్చు. రూపములు వేరువేరుగా నామములు వేరువేరుగా తమ యొక్క సిద్ధాంతములు వేరువేరుగా వుండినప్పుడు అందరియందు ఏకత్వ భావము యిది అసాధ్యమని మీరు సందేహించవచ్చు. అగాధమైన సముద్రమునందు అసంఖ్యాకములైన అలలు లేస్తూ వుంటాయి. ఒక్కొక్క అల ఒక్కొక్క రూపమును ధరించి వుంటుండాది. ఒక అలకు వేరొక అలకు యేమాత్రము సంబంధము లేనట్లుగా అనిపిస్తుంటుంది. కాని అన్ని అలల యందు కూడను జలము ఒక్కటే. అన్ని అలలు సముద్రమునకు యేమాత్రము వేరుకాదు. ఈ అలలన్ని కూడను సముద్రము కంటే యే విధముగాను భిన్నమైనవి కావు. అదే విధముగనే రూప నామములు, సిద్ధాంతములు, కర్మ కలాపములు వేరు వేరుగా వుండినప్పటికి సచ్చిదానంద సాగరమందు యివన్ని అలల వంటివే. కనుక సచ్చిదానంద సముద్రము నందు సర్వులు కూడను అలల వంటి వారే.

ప్రతి మానవుని యందు సచ్చిదానందమనేది అంతర్గతమై వుంటున్నది. ఇంక ఉపనిషత్తులనుండి భగవద్గీత ఆవిర్భవించింది. ఇది షట్కములనే టువంటి మార్గములో లోకానికి బోధిస్తూ వచ్చింది. షడంగములనే రూపమును కూడా ధరించింది. పదునెనిమిది అధ్యాయములున్నవి గీతయందు. ఆరు అధ్యాయములకు షట్కము అని పేరుపెడుతూ వచ్చారు. మూడు షట్కములు చేరి పదునెనిమిది అధ్యాయములలో గీత పూర్తవుతుంది.

మొదటి షట్కము కర్మ మార్గము. రెండవ షట్కము ఉపాసన మార్గము. మూడవది జ్ఞాన మార్గము. ఏలావాలా వేదముల నుండి ఉపనిషత్తులు, ఉపనిషత్తుల నుండి భగవద్గీత, భగవద్గీత నుండి భవ్యమైనటువంటి, ఆచరణ రూపమైనటువంటి మానవత్వము యిందులో ఆవిర్భవించింది. గీత యొక్క సారమే మానవ జాతి. ఈ జాతికి అభిమతము గీతయే. ఐతే గీత కేవలము భారతీయులకు మాత్రమే సంబంధించినటువంటిదా? ఇతర దేశముల వారికి గాని యితర మతముల వారికి గాని సంబంధము కాదని భ్రాంతిచే కేవలము వాటిని వేరు వేరుగా భావిస్తారు. కేవలము భగవద్గీత భారతీయులకు మాత్రమే సంబంధించినది కాదు. యావద్విశ్వమునకే సంబంధించినటువంటిది. ఇది భగవద్గీత. భగవంతుని యొక్క వాక్యము. నిర్మలము భగవంతుడు ఒక్కడే. ఇట్టి ఏక స్వరూపాన్ని ధరించిన భగవంతునకు, అనేక భావముల చేత, అనేక నామముల చేత అనేక రూపములను ఆరాధిస్తూ వచ్చారు. ఏక ప్రభువుకే అనేకనామ దైవమా ఒక్కడే. హిందువులుగాని, మహమ్మదీయులుగాని, క్రిష్టియన్లుగాని, బౌద్ధులుగాని పార్శీలుగాని, సిక్కులుగాని వేరువేరు రూపాలు ధరిస్తున్నారుగాని, అందరికి భగవంతుడు ఒక్కడే. ఏ పేరు పెట్టు కాని యేరూపము ఆరాధించినప్పటికి దైవమునకే చెందుతుంది. కనుకనే ఉపనిషత్తులు విశాలమైన హృదయాన్ని కలిగి సర్వదేవ నమస్కారః కేశవం ప్రతిగచ్ఛతి అన్నారు. ఎవరికి నమస్కారము చేసినప్పటికి అదంతా భగవంతునికే చెందుతుంది. పాత్రలు వేరువేరు. కాని ప్రతిబింబము ఒక్కటే. అదే విధముగనే దేహమనే ఒక పాత్రయందు, ఆత్మతత్వమనే ప్రతిబింబము విడి విడిగా కనుపిస్తుందాది. సూర్యుడు ఒక్కడే. కాని అమెరికన్ సూర్యుడని, బ్రిటీషు సూర్యుడని పాకిస్తాన్ సూర్యుడని, చైనా సూర్యుడని, భారత దేశపు సూర్యుడని వేరు వేరు ప్రత్యేకతలు లేవు కదా. సూర్యుడు ఒక్కడే. ఐతే ఒక్కొక్క దేశము వారు ఒక్కొక్క సమయములో ఆ సూర్యుని చూడవచ్చు. అందరూ ఒక్కతూరి చూడటానికి సాధ్యము కానప్పటికి వేరువేరు సూర్యుని భావించటము వెఱ్ఱితనము. కనుక వేదములు విశాలమైన అనంతమైన అగాధమైన అర్థములు కలిగి వుంటుండాయి. ఐతే యీ వేదమును పూర్ణము బోధించుటకు గురువులు చాలా కఠినమైన చర్యలు తీసుకునేవారు.

ఆనాడు అధ్యాపకులు కఠిన చర్యలు పాటించటం చేతనే యీ వేదములు యింత కాలము యీ జగత్తునందు నిలువగలిగినది. ఇది గ్రంథ స్వరూపము కాదు. శృతి. కేవలము వినుటవలనే లభ్యమయ్యేది. ఇదే అనాది కాలమునుండి గురుశిష్య పరంపరగా అభివృద్ధి అవుతూ వచ్చింది. గురువు వుచ్ఛరించటము, తిరిగి శిష్యుడు అదేరీతిగా స్వరబద్ధముగ వుచ్ఛ

రించు చుండెడివారు. ఆ నాటి గురువులు స్వార్థ రహితులు. పరిశుద్ధ హృదయులు. పరతత్వ భావమును గలిగినవారు. ప్రేమ తత్వము తో కూడినవారు. విద్యార్థుల యొక్క అభివృద్ధి నిమిత్తమై తమ జీవితమునే అంకితము గావించుచూ వచ్చేవారు. ఆనాటి విద్యార్థులు కూడను ఆ శిక్షణకు కట్టుబడి తు.చ తప్పక పాటించేవారు. వారి యొక్క ఆజ్ఞను వుల్లంఘించిన యెడల అలాంటి విద్యార్థిని ఆ పరిసర ప్రాంతములకు కూడ చేరనిచ్చేవారు కాదు. 'అకారపంచక అరిష్టములు కలిగిన వ్యక్తిని ఆ గురువులు సహించేవారు కాదు. అకారములో ప్రారంభమయ్యే అరిష్ట పంచకములు మొట్టమొదటిది అలక్ష్యము. రెండవది అవినయము. మూడవది అహంకారము నాల్గవది అసూయ. ఐదవది అసత్యము. ఈ ఐదింటిలో కూడన వాడు యె మాత్రము విద్యార్థిగ తగినటువంటివాడు కాదు. మొట్టమొదట అలక్ష్యము చేయకూడదు. అవినయము ప్రకటించ కూడదు. అహంకారమనేది మరింత ప్రమాదమైనది. ఈ అహంకారము తనను తానే మరపింప చేస్తుంది. ఇంక అసూయ యిది మహాపాప స్వరూపమైనది. ఇంక అసత్యత. అసత్యముగా మానవుడిగా వుండి సమాజమునందు యెవిధమైన విశిష్టమైన భావముతో తాను జీవించాలో దానికి విరుద్ధముగా జీవించటమే అసత్యము.

వ్యాసుల వారి దగ్గర అనేక మంది శిష్యులు యీ వేదాధ్యయన నిమిత్తమై చేరారు. అందులో మొట్టమొదటివాడు వైశంపాయనుడు. ఇతను భక్తి శ్రద్ధలతో, వినయ విధేయతలతో గురువాజ్ఞను శిరసావహించి, పాటించి తనయొక్క జీవితమును సార్థకము గావించుకున్న వ్యక్తి.

సద్గుణంబులు సద్బుద్ధి సత్యనిరతి
భక్తి క్రమ శిక్ష కర్తవ్య పాలనంబు
నేర్పునది విద్య విద్యార్థి నేర్వవలయు

ఈ విధముగా వైశంపాయనుడు గురువు దగ్గర విద్యను గురించి తాను తిరిగి వేదమును బోధించుట నిమిత్తమై ఒక గురుకులము స్థాపించాడు. గురుకులమనగా కేవలము కొన్ని అభ్యాసముల చేత కొన్ని ప్రత్యేకమైన నిబంధనల చేత యేర్పడిందని భావిస్తారు. అది కాదు గురుకులము. గురు+కులము. గురువు యిల్లే వారికి నిలయము. ఆనాడు గురువు భుజించినదే శిష్యునికి ప్రసాదముగా యిచ్చేవారు. రాత్రింబవలు గురువుతోనే జీవితము గడిపేవారు. కనుక ఆహార విహారములన్నియు కూడను గురువునకు శిష్యునకు సమానముగా వుండేవి. కనుకనే యిరువురి భావములు కూడను ఒకటిగానే వుండేవి. Food ఒకటే కనుక

head కూడా ఒక్కటిగానే వుండేది. కనుక యిట్టి ఆహార విహారములతో బాటు ఆత్మ తత్వమును బోధించేటటువంటి వారు ఆనాటి గురువులు గురుకులములో.

ఈ గురుకులమందు ప్రవేశించాడు యాజ్ఞవల్క్యుడు. మేధాశక్తిగల వాడు. చాలా చురుకైన బుద్ధి కలవాడు. ఏనాటి విద్యలు ఆనాడే నేర్చి గురువునకు అప్పజెప్పేవాడు ఇతని యొక్క తెలివితేటలకు గురువు సంతోషించాడు. ఇతను గొప్ప తెలివితేటలు గలవాడని, గొప్ప మేధాశక్తిగలవాడని పదిమంది మాట్లాడుకోటం జరుగుతూ వచ్చింది. దీనిలో యాజ్ఞవల్క్యునకు చిన్న బీజంగా అహంకారము ప్రారంభమైంది. నా క్లాసులో నాకంటె యింక గొప్ప మార్కులు తెచ్చేవారు లేరు. గురువు అడిగే ప్రశ్నలకంతా నేను తప్ప దీనికి జవాబు చెప్పేవారే లేరు. నేను 'O' grade తీసుకున్నవాడను. అహంకారము బయలుదేరే యప్పటికి అది జీరో గ్రేడ్ అయిపోయింది. ఇక్కడ అహంకారము ప్రారంభమయ్యే యప్పటికి యాజ్ఞవల్క్యునకు కొంత అలక్ష్యము కూడను అందులో ప్రవేశించింది. అలక్ష్యముతో బాటు అసహ్యత కూడను అందులో చేరుకున్నది. వీటిని చక్కగా గుర్తిస్తూ వచ్చాడు వైశంపాయనుడు ఆనాటి గురువులు శిష్యుల మంచి కోసం ప్రాణములన్నైనా యిచ్చేవారు. దారితప్పినడవటం, అవినయముగా ప్రవర్తించటం, అశ్రద్ధతో తాను చరించటము యిలాంటి దుర్లక్షణములు కలిగినవారిని చాలా కఠినముగా శిక్షించేవారు. శిక్ష అనగా విద్యే. కేవలము పుస్తకములు చదవటంకాదు విద్య. గురువు ఆజ్ఞను శిరసావహించి తాను యిచ్చే శిక్షలను మనసారా స్వీకరించటమే నిజమైన విద్య. కనుక యివన్ని గుర్తించిన వైశంపాయనుడు ఒకనాడు దగ్గరకు పిలచి 'యాజ్ఞవల్క్యా! నీవు యీ గురుకులములో చదువుటకు అర్హుడవుకావు. తక్షణమే దీనిని విడచి నీవు పోవలసినది. కేవలము పోవటమే కాదు నేనిచ్చిన విద్యలన్నీ తిరిగి వెనుకకు నాకిచ్చి వెళ్ళిపోవలసినది' అన్నాడు. ఎంతప్రేమతో తన విద్యలను శిష్యునకందించాడో అంత కఠినమైన వాక్కులతో ఆ విద్యను మరల వెనుకకు తీసుకున్నారు. ఇదంతా గుర్తించిన యాజ్ఞవల్క్యుడు తన విద్యలన్నింటిని కూడ వమనము చేశాడు. ఆ వమనమును తిత్తిరి పక్షులు భుజించాయి. కనుక ఆపక్షులు కూడ యీ వేదమును వుచ్ఛరించటం ప్రారంభించాయి. తిత్తిరి పక్షులు వుచ్ఛరించినది కనుక యీ వేదమును తైత్తిరీయోపనిషత్ అని పేరుపెట్టారు.

వేదములకు రెండు విధమైన సాంప్రదాయములు ఉన్నాయి. ఒకటి బ్రహ్మ సాంప్రదాయము. రెండవది ఆదిత్యసాంప్రదాయము. యాజ్ఞవల్క్యుడు వమనము చేసిన

వేదమునకు బ్రహ్మసాంప్రదాయము అని పేరు వచ్చింది. దీనినే కృష్ణయజుర్వేదము అన్నారు తదుపరి యాజ్ఞవల్క్యుడు తన దోషాన్ని తాను చక్కగా గుర్తించి గురువు యొక్క ఆజ్ఞను వుల్లంఘించిన తప్పు చేత, తాను ఆహారపానీయములు మాని కఠినమైన సూర్యోపాసన సలుపుతూ వచ్చాడు. పశ్చాత్తాపమే ప్రాయశ్చిత్తమని తాను పశ్చాత్తాపము చే యీవిధమైన ప్రాయశ్చిత్తాన్ని అనుభవిస్తూ వచ్చాడు. పశ్చాత్తాపము పడిన తరువాత సూర్యుడు ప్రత్యక్షమై వాజ అను రూపమును ధరించి, 'నాయనా! గడచినది గడచినది. తిరిగి నీవు యిట్టి దోషములను యేమాత్రము ఆచరించరాదు. గురుద్రోహము, దైవద్రోహము చాలా ప్రమాదము. కనుక నీవు జాగ్రత్తగా వుండమని తిరిగి వేదమునంతా సూర్యుడే ఉపదేశించాడు. వాజ రూపములో యిందుకు ప్రత్యక్షమైనాడు సూర్యుడు. యాజ్ఞవల్క్యుని యొక్క పూర్వీకులు నిరంతరము కూడను అన్నదానము సలిపేవారు. కనుక ఆ కుటుంబమునకు వాజసము అని పేరు వచ్చింది. ఈ వాజసమనే పేరు రావటం చేతనే ఆ స్వరూపాన్ని ధరించి యితనికి వేదోపదేశము చేశాడు. దీనికే శుక్లయజుర్వేదమని పేరు వచ్చింది. వాజసస్యందము అని వేరొక పేరు కూడ వచ్చింది. ఆదిత్యస్కందము అని యింకొక పేరు కూడా వచ్చింది. సూర్యోపాసన చేత లభ్యమైంది కనుక దీనికి ఆదిత్యస్కందమని పేరు వచ్చింది. వాజరూపములో ప్రత్యక్షమై బోధించటము చేత యిది వాజసస్కందమని పేరు వచ్చింది. ఈ విధముగా ఒక్కొక్క దానికి ఒక్కొక్క విధమైన రూపములు ధరిస్తూ వచ్చింది. యజుర్వేదము రెండుగా విభజించబడుతూ వచ్చింది. వేదములు నాలుగైనప్పటికి యీ యజుర్వేదము విభజింపబడటం చేత ఐదుగా రూపొందుతూ వచ్చాయి. ఋగ్వేద, యజుర్వేద, సామవేద, అధర్వణవేదమని నాలుగు వేదములు. యజుర్వేదములో శుక్లయజుర్వేదము, కృష్ణయజుర్వేదము రెండుగా విభజింపబడుట చేత ఐదు వేదములుగా రూపొందినాయి. ఆనాడు సూర్యోపాసన చేత సూర్యానుగ్రహాన్ని పొంది యిది యీలోకములో ప్రధానమైనదని విశ్వసించుకొని విచారించుకొని అన్నివిధములుగా పరిశీలించుకొని దేశమునకు కొన్ని రకములైన, సామాన్య మానవులకు సరియైన కర్తవ్యకర్మలను బోధిస్తూ వచ్చాడు యాజ్ఞవల్క్యుడు. ఆనాడు నా కుటుంబీకులు అన్నదానము సలుపుటంచేత కదా యీనాడు సూర్యుడు వాజ రూపమును ధరించుతూ వచ్చాడు. కనుకనే

అన్నదానము కన్న అధిక దానం లేదు

తల్లి తండ్రుల కంటె దైవమేది.

జపతపంబుల కన్న సత్యశీలం బేది?
దయకంటె నెక్కువ ధర్మమేది?
సుజన సంగతి కన్న చూడ లాభంబేది?
క్రోధంబు కన్న శత్రువ్వమేది?
ఋణము కంటెను నరునకు రోగమేది?
ధరణి నపకీర్తి కంటెను మరణమేది?
సర్వదా కీర్తి కంటెను సంపదతేది?
స్మరణ కంటెను మించు నాభరణమేది!

వేనికంటె మించినవి జగత్తునందు వేరొకటి లేవని నిశ్చయించి యాజ్ఞవల్క్యుడు కూడ ఆనాటి నుండి తల్లితండ్రులసేవ, గురుసేవ, అన్నదానముల యందు ప్రధానమైనటువంటివని శిష్యులకు యీవిధముగా బోధిస్తూ వచ్చాడు.

విద్యార్థులారా! ఏకాదశి దినము మనయొక్క క్లాసులు ప్రారంభమయ్యాయి. తిరిగి ఏకాదశి దినములో మనము యీ క్లాసులు పరిపూర్ణము గావిస్తున్నాము. ఈ క్లాసులన్ని కూడను మనము ఏకాదశి వ్రతములుగా భావించాలి. ఈ వ్రతమునందు అనేక మంది పెద్దలు అనుభవజ్ఞులు హృదయపూర్వకముగా మీకు అనేక విషయములను బోధిస్తూ వచ్చారు. వారంతా కూడను సులభముగా చిక్కేవారు కాదు మీకు. స్వామైనా సులభంగా చిక్కినాడు గాని వారెవరు చిక్కరు మీకు. అలాంటి వారు వచ్చి యెంతో భక్తిశ్రద్ధలతో మీకు అనేక విషయాలు బోధిస్తూ వచ్చారు. వీటిని భక్తిశ్రద్ధలతో స్వీకరించాలి. కేవలము స్వీకరించినంత మాత్రమునే చాలదు. ఆచరించాలి. ఏ కొన్నైనా కూడను మీరు ఆచరణలో పెట్టి యితరులకు ఆదర్శప్రాయంగా అందించాలి. వేదమునందు మనము ముఖ్యముగా గుర్తించినవి ఐదు ప్రాణములు. వీటిని మీరు క్షణక్షణము కూడను స్మరిస్తూ రావాలి. మొదటిది అలక్ష్యము చేయకూడదు. గురువుల యొక్క ఆజ్ఞ కాని, తల్లితండ్రుల యొక్క ఆజ్ఞలు గాని పెద్దల యొక్క ఆజ్ఞ గాని మీరు అలక్ష్యము చేయరాదు. రెండవది. అవినయముగా మీరు మెలగరాదు. వినయ విధేయుల్తై మీరు విద్యను స్వీకరించాలి. మూడవది. నీ తెలివితేటలను ఆధారము చేసుకొని అహంకారమునకే మాత్రము అవకాశము నివ్వరాదు. నాల్గవది యితరులు వున్నత స్థాయిలో అభివృద్ధి అవుతున్నారని వారిని చూచి మనము అసూయ పడరాదు. ఈ నాలుగు మీలో ప్రవేశించెనా అసత్యమనేది మీలో అవతరిస్తుంది. సమాజములో మీరు అసత్యముగా ప్రవర్తించటం ప్రారంభమవు

విద్యార్థులారా! ఈ పదహైదు దినములు కూడను బోధించిన పవిత్రమైన వేదాంత సారము, సకల శాస్త్ర, ఇతిహాస, పురాణముల యొక్క ప్రమాణములు మథించి అందించిన సుధానిధి. మీరు భవిష్యత్తులో భావి భారతోద్ధారకులు. మీరే భవిష్యత్తునందు Leaders Pleaders. మీరు ఆదర్శమైన జీవితము నందించాలి. సత్యమార్గములో ప్రవేశించాలి. మనము ధర్మాన్ని ఆచరించాలి. ధర్మో రక్షతి రక్షితః. ధర్మాన్ని మనము రక్షించినప్పుడు మనలను ధర్మము రక్షిస్తుంది. ఎలాంటి పరిస్థితులయందైనను మీరు వీటిని లేశమాత్రము ఉల్లంఘించరాదు. లోక సంబంధమైన విద్యలో అభ్యసిస్తామని మీరు భావించవచ్చు. ఆ విద్యలతో బాటు వీటిని కూడను మనము జత చేర్చుకోవాలి. ఇవన్నీ బాహ్యసంబంధమైన, లోకసంబంధమైన జీవనోపాధి నిమిత్తము ఆచరించే, అభ్యసించే విద్యలు. కాని వీటన్నింటికి ఆధారమైన ఆత్మ స్వరూపాన్ని విస్మరించరాదు. కావున ఆత్మ భావాన్ని విశ్వసించి ఆచరణ యోగ్యమైన ధర్మమును ఆచరించాలి. వేదము కూడను ఇచ్చట నిషిద్ధ ధర్మము, విహిత ధర్మము అని రెండింటిని బోధిస్తూ వచ్చింది. విసర్జించవలసినవి. స్వీకరించవలసినవి. కాని దురదృష్టవశాత్తు ఈనాడు విసర్జించవలసినదానిని స్వీకరిస్తున్నారు. స్వీకరించవలసిన దానిని విసర్జిస్తున్నారు. ఇదియే పెద్ద అజ్ఞానము. మనము ఎంత శ్రమపడి ఆర్జించినప్పటికీ వే మనము విసర్జించవలసినది విసర్జించాలి. ఒక చిన్న ఉదాహరణము. నీవు మార్కెట్టుకు వెళ్ళావు. ఐదు రూపాయలు పెట్టి పెద్ద మామిడిపండును కొన్నావు. ఇది డబ్బుతో కొన్నవాటికి ఫలము. దీనికి ఐదు రూపాయల విలువ నిచ్చావు. అని దాని తోలును, విత్తనాన్ని కూడ నీవు తింటావా? కాదు. కాదు. దానియొక్క రసమును మాత్రమే నీవు స్వీకరించి దాని తోలు విత్తనాన్ని విసర్జించాలి. ఈ జగత్తనే ఫలమునందు విసర్జించవలసినది విసర్జించాలి. స్వీకరించవలసినది స్వీకరించాలి. అదే మీకు ఎన్నో పర్యాయములు చెప్పాను.

See no evil see what is good.
Hear no evil hear what is good.
Talk no evil talk what is good.
Think no evil Think what is good
DO no evil Do what is good.
This is the way of Life.

ఇది మనము సరైన దృష్టిలో పెట్టుకోవాలి. చెడ్డను వినవద్దు. చెడ్డను చూడవద్దు. చెడ్డను

చెప్పవద్దు. చెడ్డను తలచవద్దు. చెడ్డను చేయవద్దు.

విద్యార్థులారా, మీరు చాలా అదృష్టవంతులు. ప్రపంచములో యిన్ని లక్షల మంది వుండినప్పటికి, కోట్లమంది వుండినప్పటికిని, యీ కొంతమందికే యీ సదవకాశము లభించిందంటే యిది యెంతో అదృష్టము. లభించిన మీయందు కూడను యే కొంతమందైనా ఆదర్శప్రాయులుగా నిలిస్తే అంతేచాలు. ఎటువంటి అధికారమున్నైనా మీరు చేయవచ్చు. ఎలాంటి వుద్యోగములోనైనా మీరు ప్రవేశించవచ్చు. ఎలాంటి వ్యాపారమున్నైనా మీరు చేయవచ్చు. ఎలాంటి వ్యవసాయమున్నైనా సలుపవచ్చు. తప్పులేదు. కర్తవ్య కర్మలు ఆచరిస్తూ ఆత్మవిశ్వాసాన్ని విసర్జించకుండా చూచుకోవాలి. ఈనాడు లోకములో యిన్ని కష్టములకు, యిన్ని నష్టములకు, యిన్ని దుఃఖములకు, యిన్ని అనాచారములకు, యిన్ని అన్యాయములకు మూలకారణము ఆత్మవిశ్వాసము లేకపోవటమే. ఈనాటి మానవుడు తనను తానే నమ్మలేక పోతున్నాడు. ఈనాటి విద్యార్థులందరు యేవిధంగా వున్నారంటే తన జేబులో నూరు రూపాయలు వుంటుంటే యిది నేను ఖర్చు పెడతానేమో యీ నూరు రూపాయలు నీదగ్గర పెట్టుకొని వుండు అనిఅంటాడు. తన నూరు రూపాయలనే తాను కాపాడుకోలేనటువంటి అపనమ్మకము గలవాడు యితరులను మాత్రము నమ్మగలడా. ఇచ్చిన నిముషము నుండి కూడను వాడు నాకు యిస్తాడో యివ్వడో అని అనుమానముతో వుంటాడు. కనుకనే మొట్టమొదట self confidence ఆత్మవిశ్వాసాన్ని పెంచుకోవాలి. self confidence ను మనము అభివృద్ధి పరచుకున్నప్పుడే మనకు self satisfaction అలవడుతుంది. అప్పుడే మనకు తృప్తి కలుగుతుంది. ఆ తృప్తి ఎంత ధనమిచ్చినా మనకు లభ్యమయ్యేది కాదు. ఆత్మవిశ్వాసమే లేకపోతే తృప్తి అనేదే వుండదు. అసంతృప్తో ద్విజో నష్టః అన్నారు. అసంతృప్తి కలిగినవారికి అన్నీ నష్టములే. కనుక కొన్ని నష్టములకు, కష్టములకు గురికాకుండా వుండే నిమిత్తమై తృప్తిని మనము అలవరచుకోవాలి. ఆ తృప్తి ఆత్మవిశ్వాసము తోనే మనకు లభ్యమవుతుంది. కనుక self satisfaction వచ్చిందా యింక ఒకరు అడుగనక్కరలేదు. ఒకరు చెప్పనక్కరలేదు. self sacrifice తాను త్యాగము చేస్తాడు. ఈ త్యాగము చేసినా self realisation అప్పుడే మనకు లభిస్తుంది.

కనుక మనము ఆత్మసాక్షాత్కారము నిమిత్తమై ఎప్పుడో ఎక్కడో ఏ కారణము చేతనో అనే భ్రమలను విసర్జించి యీ భావనలను పవిత్రమైన త్యాగములను మనము ఆచరించినప్పుడు అప్పుడే అక్కడే మనకు అన్నివిధాలా లభ్యమవుతుంది. కనుక ప్రతి విద్యార్థి కూడను సత్కార్మల

లో ప్రవేశించాలి. సత్కర్మలు ఆచరించినప్పుడే చిత్తశుద్ధి మనకు కలుగుతుంది. చిత్తశుద్ధి కలిగినప్పుడే జ్ఞానసిద్ధి లభ్యమవుతుంది. ఇవన్నీ కూడను మనలోనే వుంటున్నాయి. మనము బయటకు పోయి ఎక్కడో వెతకనక్కరలేదు. ఏ గ్రంథములు మనము చదవనక్కరలేదు. తనయందు తాను వెతుక్కుంటే ఎప్పుడైనా తనకు లభ్యమవుతుంది. ఇక్కడ wall clock ఒకటి వుంటుందండి. ఈ wall clock లోపల మూడు ముల్లులుంటున్నాయి. ఒకటి నిముషముల ముల్లు, రెండవది సెకండు ముల్లు, మరొకటి hour ముల్లు. ఈ సెకండు, నిముషముల, గంటల ముల్లు. దీనిని చక్కగా మనము పరిశీలన చేస్తే పరిశోధన చేస్తే ఎంత చక్కగా మనకు అర్థమవుతాయి. ఆ సెకండ్ల ముల్లు టక్ టక్ అని అరవై యిండ్లు ప్రయాణము చేసినప్పుడు యీ నిమిషముల ముల్లు ఒక యిల్లు మాత్రమే చేరుతుంది. చూశారా యీ నిమిషముల ముల్లు అరవై యిండ్లు దాటుకొని వస్తే hour ముల్లు ఒక్క యిల్లు మాత్రమే చేరుతుంది. మన దేహము ఒక wall clock వంటిది. మనము ఒక కర్మను చేస్తున్నాము. నిర్విరామ కృషి సలుపుతున్నాము. యిదే సెకను ముల్లు. తెల్లవారి లేచినది మొదలు రాత్రిపరుండు వరకు మంచి కర్మలు చేస్తూ వున్నాము. మనము మంచి కర్మలు అనేకము చేసినప్పుడు నిమిషముల ముల్లు అనగా చిత్తశుద్ధి ఒక స్థాయికి వచ్చి చేరుతుంది. ఇక్కడ ఉపాసన అనగా చిత్తశుద్ధితో దైవాన్ని అనేక విధములుగా ప్రేమించి, అతనిని ఆరాధించి, భజించి, మనము స్మరించినప్పుడు hours ముల్లు అనే ఆత్మ ఒక స్థాయికి వచ్చి చేరుతుంది. ఇలా సెకండ్ల ముల్లు కదిలేది మనకు చక్కగా కనిపిస్తున్నది. నేను ఎన్ని సత్కర్మలాచరించాను అని చక్కగా నేను లెక్కవేసుకోవచ్చు. నిమిషముల ముల్లు కూడను నేను యెన్ని విధములుగా భగవంతుని ప్రార్థన సలుపుతున్నాను, ఎన్ని విధములుగా ఉపాసన సలుపుతున్నాను అని అది కూడను కనిపిస్తుంది కొంచెము ముల్లు తిరిగేది. కాని hours ముల్లు కదిలేది కనుపించదు. ఐతే ఆ కనుపించని hours ముల్లు నిమిత్తమై యీ నిమిషముల ముల్లు, సెకండ్ల ముల్లు అవసరము గాని యీ hours ముల్లు లేకపోతే యీ నిమిషముల ముల్లు, సెకండ్ల ముల్లు వృథా. ఏమి చెప్పలేము. కనుక మనము యీ సత్కర్మలు, సచ్చింతనలు చేసి ఆత్మవిశ్వాసము లేకపోతే యిది కేవలము నిరుపయోగమవుతుంది.

కనుక విద్యార్థులారా! మరు సమయము చిక్కినప్పుడు
శ్రవణం కీర్తనం విష్ణోః స్మరణం పాదసేవనం
అర్చనం వందనం దాస్యం స్నేహమాత్మనివేదనం.

ఈ నవ విధమైన మార్గములలో ఏ ఒక్క మార్గమైనా ఆచరించండి. భగవంతుడు నీయొక్క ధన వస్తు వాహనాలు కాని, నీ వస్తు సంపత్తులుగాని యేమీ చూడడు. నీయొక్క కులగోత్రములు కూడను అతను విచారించడు. ఎవరు హృదయ పూర్వకమైన ప్రేమతో తనను ఆశ్రయిస్తారో వారికి సన్నిధియై పెన్నిధియై వుంటాడు

వాల్మీకి ఏవ్వని వంశమందలివాడు
నందుండు ఏ పల్లెయందు పుట్టె
ధనకుచేలుడెంత ధనము కలిగియుండె
గజరాజు ఏ విద్య కల్గియుండె.
వసుధ ధ్రువుండెంత వయసు కల్గియుండె
శబరి యెంతటి శక్తి కల్గియుండె.
విదురుని కెంతటి వితరణమతి యుండె
విప్రుని కెంతటి తెలివియుండె.

'వాల్మీకి ఏవ్వని వంశమందలి వాడు'. ఏ వంశాన్ని చూచి భగవంతుడు అనుగ్రహిస్తాడంటే వాల్మీకి ఏవ్వని వంశమందలివాడు. కేవలము కోయ జాతికి సంబంధించినవాడు. 'నందుండు ఏ పల్లెయందు పుట్టె': ప్రపంచములోపల ఒక హీనమైన పల్లెయని భావించేవాడు ఆ నందుడు. భగవంతుడు దానిని చూడడు. 'ధనకుచేలుండెంత ధనము కల్గియుండె' కుచేలునకు యేమి ధనము వుంటుందండి. అటుకులు కూడను లేవు చేతిలో. అలాంటి వానికి సర్వ సౌభాగ్యములు అందించాడు భగవంతుడు. దేనిని చూచి అందించాడు. ఆ ప్రేమను చూచి. 'గజరాజు ఏ విద్య కల్గియుండె'. వసుధ ధ్రువుండెంత వయసు కల్గియుండె. ఇతను పెద్ద వాడు, ఇతడు సన్యాసి, ఇతను పండితుడు, నేను సామాన్యమైన వాడను, నేను చిన్నపిల్లవాడను ఈ విధముగా భావించుకో నక్కరలేదు. వయస్సును చూడడు భగవంతుడు. ధ్రువుని కెంత వయస్సు. ఐదు సంవత్సరముల వయస్సు. ప్రహ్లాదుడెంత వయస్సు ఐదు సంవత్సరముల వయస్సు. వారు అదృష్టవంతులు కనుకనే ఆ వయస్సునందు దివ్యమైన అనుభూతులను పొందగలిగారు. 'శబరి యెంతటి శక్తి కలిగి యుండె' ఆ శబరికి ఏ శక్తి కూడను లేదు పాపం. కంద మూలాదులు భుజించి, చెట్టు వెనుక కూర్చుని, ఋషులు బోధించేదంతా కూడను ఏకాగ్ర చిత్తులై వింటూవున్న వ్యక్తి శబరి. ఏ కర్మలు ఆచరించినా కానీ భగవత్ప్రీత్యర్థము ఆచరిస్తూ వచ్చింది. మతంగ మహర్షి చెప్పాడు: అమ్మా!

శ్రీమన్నారాయణుడు దశరథ మహారాజు కుమారుడుగా పుట్టి శ్రీరామ చంద్రుడు పితృవాక్య పరిపాలన నిమిత్తమై అరణ్యములో ప్రవేశించాడు అన్నారు. అప్పటినుండి శబరి అడవులలో వెళ్ళాడుట శ్రీరామ చంద్రుడు, అడవులలో సంచరిస్తున్నాడంట శ్రీరామ చంద్రుడు. నేను కూడ అడవిలో వుంటున్నాను. ఎప్పుడైనా యీ మార్గములో వస్తాడో యేమో అని యిదే తపన ఆమెకు. దీర్ఘ ధ్యానము. దీర్ఘ జపము. పాపం శబరి బాలా పొట్టిది. ఆమె కొన్ని పొదలలోనుండి వెళుతూ కంద మూలాదులు భుజించే నిమిత్తమై వెళుతూ, ఆ పొదలే మన్ని తనకు తగులుతే తాను యోచించేది. శ్రీరామ చంద్రుడు ఆజాను బాహుడట, మా గురువు గారు వర్ణించారు. ఇలాంటి ఆజాను బాహుడగు శ్రీరామ చంద్రుడు యీ దారిలోనే ప్రవేశిస్తే యీ పొదలంతా అతని తలకు తగులుతాయేమో అని ఆ కొమ్మలంతా కొట్టేసుకుంటూ పోయేది. ఇది ఎంత సేవ చెప్పండి. అలసి పోయి ఒక రాతిపై కూర్చున్నప్పుడు చింతించేది శ్రీరామ చంద్రుడు యీ అడవిలో సంచరించేటప్పుడు తాను అలసిపోయి యీ రాతిపైననే కూర్చుంటే యీ రాయి ఎంతగరుకుగా వుంటుందాని కనుక దీనిని నునుపుగా చేయాలి అని చక్కగా దానిని ఒక రాతితో నునుపు చేస్తూ కూర్చునేదట. అదే ధ్యానము. అదే తపస్సు. తరువాత తాను భుజించే నిమిత్తము రేగు పండ్లు తెచ్చుకొనేది. అప్పుడు కూడను ఆ స్వామినే చింతించటం. నా స్వామి యీ మార్గములో వచ్చి 'అమ్మా! మీరెవరు? నాకు ఆకలవుతుందంటే నా స్వామికి యివ్వటానికి యీ పండ్లలో యేమైనా తియ్యని ఫలములున్నవా అని చక్కగా పరీక్ష చేసి పరీక్ష చేసి తియ్యని ఫలములు తీసి పెట్టుకొనేదట. కనుక శబరి చేసిన సర్వ కర్మలు కూడను తపస్సుగా మారి పోయాయి. కేవలము ధ్యానము ధ్యానమంటే కన్నులు మూసుకొని డాకలు కొట్టుకుంటూ ఫోటో ఫోజు కోసం కూర్చున్నట్టుగా కూర్చుంటే కాదు ధ్యానము. ఇది నిజమైన ధ్యానము కాదు. ఏ పని చేసినా భగవద్ధ్యానముగానే వుండుండాలి. నీవు భుజించే దంతా కూడను భగవంతునికి నైవేద్యంగా భుజించు. నీవు వదలనక్కరలేదు. నీవు త్రాగే నీరంతా నేను త్రాగుతున్నాననుకో. ఈ విధముగా మనము చేసే పనులన్నీ భగవంతుని కోసం చేస్తున్నామనుకున్నప్పుడు చెడ్డపనులు మనము ఏమాత్రము చేయలేము.

కనుక విద్యార్థులారా! పవిత్రమైన సూత్రములను మరియు క్షేత్రములందుంచుకొని శ్రోత్రముల ద్వారా విన్న విషయములను, హస్తముల ద్వారా ఆచరించి, పవిత్రమైన పౌరులుగా రూపొంది భావి భారతలో రక్షకులుగా రాణిస్తారని నేను ఆశిస్తూ ఆశీర్వదిస్తూ నా దీర్ఘ ప్రసంగాన్ని విరమిస్తున్నాను.